క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కమలాపురం : ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏఓ సరస్వతి తెలిపారు. శుక్రవారం మండలంలోని దాదిరెడ్డిపల్లెలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి పలు రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి వరి పంటను సాగు చేస్తే ఖర్చు తగ్గడంతో పాటు ఆరోగ్యవంతమైన దిగుబడిని సాధించవచ్చన్నారు. రైతులు వారి పొలాల్లో ఉన్న చీడ పీడలను గుర్తించి అవసరం మేరకు మాత్రమే రసాయనిక ఎరువులను వాడాలన్నారు. వ్యవసాయ పర్యావరణ వ్యవస్థ విశ్లేషణ, ప్రధాన క్రిమి కీటాదుల జీవిత చక్రాలపై విశ్లేషణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆకుల కత్తిరింపు, వంగడాల డీ పొల్యూషన్, ప్రయోగ ఫలితాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణ వితరణ



ఆలయ సభ్యులకు ఆభరణం అందిస్తున్న చంద్రశేఖర్

వేంపల్లె : స్థానిక శ్రీవాసవి కన్యకా పరమేశ్వరిదేవస్థానంలో వాసవి మాతకు భక్తుడు బంగారు ఆభరణం వితరణ చేశారు. వేంపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ రూ.1,05,000లు విలువ చేసే బంగారు బీడు హారం శుక్రవారం అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులకు కుటుంబ సభ్యులతో కలిసి అందజేశారు. అనంతరం వారిని సత్కరించారు.

పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి భద్రత



ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్, సిబ్బంది

కమలాపురం : పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి భద్రత అని కమలాపురం మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్, కోర్టు, తహసీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ సిబ్బంది కార్యాలయాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. చెత్తా చెదారాన్ని ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి భద్రత అన్నారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీటీ జ్యోతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తే కఠిన చర్యలు

వేంపల్లె : వేంపల్లి మేజర్ గ్రామపంచాయతీలో అధికారులు, సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె వేంపల్లి గ్రామపంచాయతీని ఆకస్మికంగా తనిఖీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో అధికారులు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న అధికారులు కచ్చితంగా రికార్డును మెయింటైన్ చేయాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని గ్రామపంచాయతీ ఈవో నాగభూషన్‌రెడ్డికి ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధిలో డ్రైనేజీ, పారిశుద్ధ్యన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి సమష్టిగా కృషి చేయాలి

వీరపునాయునిపల్లె : మండలంలోని 22 గ్రామ పంచాయతీల అభివృదిద్ధికి ప్రజా ప్రతినిధు లు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి పి లుపునిచ్చారు. శుక్రవారం పంచాయతీల అభివృద్ధిపై మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎఐ 2.0 సంబంధించిన అంశాలపై ట్రైనర్‌లు వివరించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి చలపతి, ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పురోగతిపై శిక్షణ కార్యక్రమం


ఎర్రగుంట్ల : మండలంలోని గ్రామ పంచాయతీలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధనకు పంచాయతీ పురగతికి కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. శుక్రవారం ఎంపిడిఓ సభ భవనంలో ఉపమండలాధ్యక్షులు మల్లు వెంకట మోహన్‌రెడ్డి అధ్యక్షత కార్యక్రమం జరిగింది. అధికారులు,సర్పంచ్‌లు, ఎంపిటీసీలు పాల్గొన్నారు.

వన విహారిణిగా వాసవీ కన్యకాపరమేశ్వరి

పులివెందుల టౌన్ : పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు వనవిహారణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంకాలమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేంకటరమణుడి ఆలయంలో స్వామివారు గోవర్ధనగిరిదారి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కమలాపురం లో..

కమలాపురం : పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం శ్రీ అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని సహస్రనామ కుంకుమార్చన, మంగళ హారతి నిర్వహించారు. అలాగే ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఈశ్వరునికి పూజ, అష్టోత్తర పూజ నిర్వహించారు. రాత్రి లక్కిడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.



పులివెందుల : వన విహారిణిగా వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : స్థానిక కన్యతీర్థంలో శ్రీ బాలత్రిపుర సుందరీదేవి మహాలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు హరిహరనాథ శర్మ పూజలు నిర్వహించారు.



కమలాపురంలో వెలసిన కన్యకాపరమేశ్వరీ దేవీని చీరలతో అభిషేకం చేసిన భక్తులు

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : పాతూరులో అమ్మవారు శ్రీమహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.

యర్రగుంట్లలో



జమ్మలమడుగు : కన్యతీర్థంలో మహాలక్ష్మీ అలంకరణలో అమ్మవారు

ఎర్రగుంట్ల : పట్టణంలోని శ్రీమత్ కన్యకాపరమేశ్వరి దేవి ఆలంయలో శ్రీ వనవిహారణిదేవి అలంకరణలో, శ్రీ ఏరువాక గంగమ్మతల్లి దేవాలయంలో శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకరణలో, నడిపూరులో శ్రీ అంకమ్మతల్లి దేవాలయంలో శ్రీ శారదదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శినించారు.

కొండాపురంలో..

కొండాపురం : దత్తాపురం గ్రామంలోని శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అంకారంలో దర్శనమిచ్చింది.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : పొలతల క్షేత్రంలో గాయిత్రిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శినమించారు. ఆలయ ఈఓ కృష్ణానాయక్, అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : తలపనూరు గంగమ్మతల్లి విశిష్ట లలితాదేవిగా, కీర్తిపల్లె నల్లనమ్మ తల్లి గాయత్రీదేవిగా, అనిమెల బోగాదమ్మ తల్లి లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమివ్వగా గడ్డంవారిపల్లెలో రాజరజేశ్వరీదేవి, సంగమేశ్వరాలయంలో పార్వతీదేవి మహా లక్ష్మిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వాసవి మాత శుక్రవారం శ్రీ భవాని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో వాసవి మాతకు ఐదు రకాల హారతులు ఇచ్చారు.



సింహాద్రిపురం : శ్రీమహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు



ఎర్రగుంట్ల : శ్రీ ఏరువాక గంగమ్మతల్లి ఆలయంలో శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు



కొండాపురం : పెద్దమ్మ ఆలయంలో మహాలక్ష్మి అలంకణలో దర్శనమిచ్చిన అమ్మవారు



పెండ్లిమర్రి : పొలతలలో గాయిత్రిదేవి అలంకరణలో ఉన్న అమ్మవారు



వీరపునాయునిపల్లె : గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన కీర్తిపల్లె నల్లనమ్మ తల్లి

సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి

కమలాపురం : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకుని పంచాయతీల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ గండి భారతి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్, 2025–26 వార్షిక ప్రణాళిక రూపొందించడంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షా కాలం కావడంతో ఎటు చూసిన విష జ్వరాలు విజృంభిస్తున్నాయని, వైద్య సిబ్బందితో ప్రజా ప్రతినిధులు కలసి క్షేత్రస్థాయిలో పర్యటించి రోగాలను అదుపు చేయడానికి కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ గౌస్‌బాషా మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేయాలని, తద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చన్నారు. గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ చెన్న కేశవరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ కెజియా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్ తదితరులు మాట్లాడారు. ఎంఈఓ బేబి, ఏఓ సరస్వతి, పశు వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి తదితర శాఖల అధికారులు తమ శాఖల పనితీరు గురించి వివరించారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌస్ బాషా

చింతకొమ్మదిన్నెలో

చింతకొమ్మదిన్నె : స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో శుక్రవారం పంచాయతీల సమగ్ర అభివృద్ధి, పనితీరు, పురోగతిపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప మండలాధ్యక్షుడు గజ్జల సుధాకరరెడ్డి, ఎంపీడీఓ కుళ్లాయి బాబు, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన పోల్‌రెడ్డిని ముద్దనూరులోని పులివెందుల రహదారిలో అరెస్టుచేసి అతని వద్ద అక్రమంగా వున్న 12 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రమేష్ తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెండ్లిమర్రి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

కాలుష్యం కొలిచే యంత్రం ఏర్పాటు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని న్యూకాలనీలో కాలుష్యం కొలిచే యంత్రంను ఏర్పాటు చేశారని కౌన్సిలర్ ఎరికలరెడ్డి తెలిపారు. సమీపంలో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి అధికంగా దుమ్ము పొగ వస్తుందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. న్యూకాలనీలో కాలుష్యం ఎంత వస్తుందో తెలుసుకుని కాలుష్య నియంత్రణ యంత్రంను ఏర్పాటు చేశారన్నారు.

గ్రామాల్లో ప్రగతి వేదికపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యురాలు షేహానా

కొండాపురం : గ్రామాల్లో ప్రగతి వేదికపై అవగాహన కల్పించినట్లు ఎంపీడీఓ నాగప్రసాద్ తెలిపారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మిదేవి అధ్యక్షతన గ్రామ పంచాయతీ పురోగతి కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో ఇంటింటికి తాగునీటి కుళాయి కనెక్షన్ అందించేవిధంగా చర్యలు చేపడుతామన్నారు. గ్రామాల్లో శానిటేషన్‌పై సమస్య ఉంటే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తాళ్లప్రొద్దుటూరు వైద్యురాలు షేహానా, ఎంఈఓ–2 రామయ్య, ఉపమండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సంర్పంచ్‌లు లక్ష్మినారాయణరెడ్డి, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలేరు నగరి ప్రాజెక్టును పూర్తి చేయాలి

చింతకొమ్మదిన్నె : పెండింగ్‌లో ఉన్న గాలేరు–నగరి ప్రాజెక్టుకు అంతర్భాగంగా ఉన్న గుర్రంగుంపు స్టాక్ పాయింట్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గుర్రంగుంపు స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్టుల కన్నా ముందునుంచే పెండింగ్‌లో ఉన్న గాలేరు నగరి ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పదవీ కాంక్షతో ఈ ప్రాంతాల అభివృద్ధి కొరకు ఈ ప్రాంత రాజకీయ నేతలు నోరు మెదపడం లేదన్నారు. గుర్రంగుంపు స్టాక్ పాయింట్‌ను పూర్తిచేస్తే ఈ ప్రాంతంలోని సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. పెండింగ్ ప్రాజెక్టు నిధుల కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో దశలవారీ పోరాటాలకు శ్రీకారం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



గుర్రంగుంపు స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వివాహ వేడుకల్లో పాల్గొన్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

పులివెందుల : పులివెందులలోని వీజే ఫంక్షన్‌హాల్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు ఇలాహీ కుమారుడు పిరోజ్‌నూర్ వివాహం శుక్రవారం జరిగింది. ఈ వివాహానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరై పిరోజ్‌నూర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్, మైనార్టీ నాయకులు రసూల్, నూరుల్లా, కొంగనపల్లె మురళి తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి

జమ్మలమడుగు రూరల్ : ఆర్టీసీ కార్మికులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని రాష్ట్ర ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. శుక్రవారం జమ్మలమడుగు ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించి ప్రజలకు అందుతున్న సేవల గురించి అరా తీశారు. అనంతరం డిపో గ్యారెజీ పరిసర ప్రాంతాలు, ప్రజల మరుగుదొడ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కారించడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం డిపోలో మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఈడీఈ చెంగల్‌రెడ్డి, జిల్లా ఆర్ఎం గోపాల్‌రెడ్డి, డిపో మేనెజర్ పి.వి.ప్రవీణ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



డిపో ఆవరణలో మొక్కలు నాటుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తోడ్పడాలి

సింహాద్రిపురం : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని అలాగే ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పెంచి పోషించాలని ఉపాధిహామీ పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సచివాలయం ఆవరణలో ఆయన ఉపాధి హామీ సిబ్బంది, రెవెన్యూ అధికారుల సమక్షంలో మొక్కలు నాటి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కేవలం పనికి మాత్రమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు, గ్రామాల అభివృద్ధికి కూడా ఉపయోగపడుతుందన్నారు. అధికారులు, సిబ్బంది మాత్రమే కాకుండా ప్రతి గ్రామస్తుడు ఈ ప్రయత్నంలో భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ సాయినాథ్‌రెడ్డి, ఏపీఎం మంజునాథ్, ఈసీ శ్రీనివాసరెడ్డి, సచివాలయ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఉపాధిహామీ పీడీ ఆదిశేషారెడ్డి

విత్తన శుద్ధి విధానం పాటించాలి

ముద్దనూరు : రైతులు తప్పకుండా విత్తన శుద్ధి విధానాన్ని పాటించాలని డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ శాస్త్రవేత్త కృష్ణప్రియ సూచించారు. శుక్రవారం ఆమె మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డితో కలిసి యామవరం రైతుసేవాకేంద్రంలో మినుము పంటసాగుపై సలహాలు అందించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, సమగ్ర సస్య రక్షణ పద్ధతులను పాటించాలని, రసం పీల్చే పురుగుల నివారణకు జిగురు అట్టలను ఏర్పాటుచేసుకోవాలని పేర్కొన్నారు. ఏవో మాట్లాడుతూ రైతులు తమ ప్రాంతాలకు అనువైన పంటలను మాత్రమే సాగుచేయాలని, మినుము పంటలో తగినమేరకే ఎరువులను వినియోగించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాట్‌సెంటర్ కో ఆర్డినేటర్

రేపు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని డాక్టర్ ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి (దినేష్ మెడికల్ సెంటర్)లో ఆదివారం కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్. హితేష్ రెడ్డి మధ్యాహ్నం నుండి అందుబాటులో ఉంటారని అలాగే ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్, డి.నిహారిక క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమం తప్పకుండా అనుసరించడం ఇతర క్యాన్సర్ సంభంధిత సంప్రదింపులకి అందుబాటులో వుంటారు.

ఉచిత షుగర్ పరీక్షలు

ఆదివారం ఉదయం 6 గంటల నుండి షుగర్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎ.హర్షవర్ధన్ రెడ్డిచే సలహాలు సూచనలు ఇవ్వబడును పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతనముగా డయాలసిస్ సెంటర్ ప్రారంభించడం జరిగిందన్నారు. కావున కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ వరలక్ష్మి గారు ప్రతి రెండవ మరియు నాల్గవ శనివారం సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు అందుబాటులో వుంటారన్నారు. సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా డాక్టర్ ఈ సి దినేష్ రెడ్డి గారు తెలిపారు. మరిన్ని వివరములకు సంప్రదించగలరు : 9703622831, 08568286189

బాలకృష్ణా నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది

పులివెందుల టౌన్: బాలకృష్ణ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే మంచిదని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, కో ఆప్షన్ చంద్రమౌళి, బలిజ సంఘం నేత తోటశెట్టి హరిలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి స్వగృహంలో వారు విలేకరులతో మాట్లాడుతూ . చిరంజీవిని బాలకృష్ణ అవమానించిన కూడా ఖండించలేని దయనీయ స్థితిలో పవన్‌కళ్యాణ్ పార్టీ కేడర్ ఉందన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో మిత్ర పక్షాలకు కూడా మాట్లాడే స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు లేకుండా పోయాయన్నారు. అప్పట్లో మహిళలను కించపరిచేలా అవమానకరంగా మాట్లాడి, ఇప్పుడు అసెంబ్లీలో కూడా చెత్తవాగుడు వాగుతూ అన్నింటికీ మెంటల్ సర్టిఫికెట్ సాకుగా చూపే నువ్వు ఇకనైనా బుద్ధిగా మాట్లాడితే బాగుంటుందన్నారు. అఖండ సినిమా టికెట్ ధరల కోసం మీరు ప్రత్యేకంగా జగన్‌ను కలుస్తా అని వర్తమానం పంపించినా.. చంద్రబాబు సొంత ఇంటి మనిషి.. నాతో కలిస్తే మీ మధ్య మనస్పర్థలు వస్తాయని మీకు కావాల్సిన పనిచేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. చేసిన మంచిని మరిచి ఇష్టమొచ్చినట్లు మాట్లాడే నువ్వు నిజమైన సైకో.. నువ్వు చైర్మన్‌గా ఉన్న బసవతారకం ఆసుపత్రికి కూడా రాజకీయాలు పక్కనపెట్టి మరీ సీఎంఆర్‌ఎఫ్ నిధులు బకాయిలు లేకుండా చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డిదే నని.. అలాంటి మంచి మనిషిని తూలనాడటానికి నోరు ఎలా వచ్చిందన్నారు. వైఎస్ జగన్ అసెంబ్లీకి వస్తే ఎక్కడ మీ ఆగడాలు, మోసాలు ప్రజలకు తెలుస్తాయో అని రానివ్వకుండా నాటకాలు ఆడుతున్నారన్నారు. ఇంకోసారి ఇలా మాట్లాడితే ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె: ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో చిరంజీవి నుద్దేశించి అనుచితంగా మాట్లాడటాన్ని శుక్రవారం కమలాపురం వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గజ్జల ఈశ్వరరెడ్డి ఖండించారు. బాలకృష్ణకు మతిస్థిమితం సరిగా లేనట్లు అర్థమవుతోందన్నారు. గతంలో సినీ నిర్మాత పైన కాల్పులు జరిపి తన మానసిక పరిస్థితి సరిగా లేదని మెంటల్ సర్టిఫికెట్ తీసుకున్న విషయం గుర్తుకు వస్తోందన్నారు. కాల్పులు జరిగినప్పుడు 30 సంవత్సరాల అనుభవం అని చెప్పుకుంటున్న చంద్రబాబు నాయుడు ఏమి చేయలేకుంటే అప్పటి సీఎం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి బాలకృష్ణకు సహాయం చేసి మానవత్వం చాటుకున్నారన్నారు. కానీ ఇప్పుడు ఈ బాలకృష్ణ జగన్మోహన్‌రెడ్డి గురించి మాట్లాడటాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు.

కొండాపురంలో..

కొండాపురం: ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో సినీ హీరో చిరంజీవీ, సినీ పెద్దలను అవమానించే విధంగా మాట్లాడటం సరికాదని రాష్ట్ర యువజన కార్యదర్శి ఆర్.హరినారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సినీపరిశ్రమ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన గురించి అనుచితంగా మాట్లాడటాన్ని ఖండిస్తున్నామని అన్నారు.ఇకనైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదని పేర్కొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు: చిరంజీవితోపాటు చిత్ర పరిశ్రమ పెద్దలు కలిసినప్పుడు సీఎం హోదాలో వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి సానుకూలంగా వారి సమస్యలు విని పరిష్కరించారు. ఇది తెలియని బాలకృష్ణ చిరంజీవిని అగౌరవపరిచేలా అబద్ధాలు చెబుతున్నారు. ఇది సరికాదని వైఎస్సార్‌సీపీ యుజవన కార్యదర్శి రాఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బాలకృష్ణా.. గతంలో మీ ఇంట్లో నిర్మాత బెల్లంకొండ సురేష్ తోపాటు మరోవ్యక్తిపై కాల్పులు జరిపి ఎక్కడ జైలులో వేస్తారో అని భయపడి మెంటల్ సర్టిఫికెట్ తెచ్చుకుని తప్పించుకున్నవాడివి.. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే అర్హత నీకు లేదని అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెంటనే బాలకృష్ణ జగన్‌కు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.